

రెండవ దశ

# భగత్‌సింగ్ జన్ అధికార్ యాత్రలో

## భాగస్వాములుకండి!

10 డిసెంబర్, 2023 - 3 మార్చి, 2024

**పెరిగే ధరలను ఆపాలి, లేదా గద్దె దిగిపోవాలి!**

**విద్య, వైద్యం, ఉపాధి ప్రజలందరికీ అందాలి!**

**భగత్‌సింగ్ సందేశం అందుకొని నూతన విప్లవ మార్గాన పయనిద్దాం!**

**కుల-మత ఘర్షణలను వదలండి,నిజమైన పోరాటంలో భాగంకండి!**

మిత్రులారా!

'**భగత్‌సింగ్ జన్ అధికార్ యాత్ర**' రెండవ దశలో భాగంగా మేము మీ ముందుకి వచ్చాము. భారత ప్రజల మౌలిక హక్కుల కోసం జరుగుతున్న పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళడం, ఆ దిశగా ప్రజలని చైతన్యపరచడం, సంఘటితం చేయడం ఈ యాత్ర లక్ష్యాలు. **డిసెంబర్ 10, 2023న కర్ణాటకలోని బెంగళూరులో ప్రారంభమయ్యే ఈ యాత్ర, దేశంలోని 13 రాష్ట్రాలు, 80కి పైగా జిల్లాల మీదుగా 8,500 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మార్చి 3, 2024న ఢిల్లీ చేరుకుంటుంది**. ఇందులో మీ అందరి భాగస్వామ్యం అవసరం. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, అవినీతి ప్రజల జీవితాలను నరకప్రాయం చేస్తున్నాయి. ఎంతో మంది తమ పిల్లలకు కనీస పౌష్టికాహారం, వైద్యం, నాణ్యమైన విద్య కూడా అందించలేకపోతున్నారు. మన జీవితాలతో నేరుగా సంబంధం ఉన్న ఇలాంటి విషయాల గురించి ఆలోచించనివ్వకుండా కులం-మతం, మందిర్-మస్జిద్, రిజర్వేషన్లు, జాతీయవాదం లాంటి వివాదాలతో మనల్ని విడదీసేందుకు పాలకులు ఎన్నో కుట్రలు పన్నుతున్నారు.

దేశంలోని సామాన్య శ్రామిక ప్రజల జీవన స్థితిగతులు మనందరికీ తెలియనివి కావు. పేదరికానికి, నిరుద్యోగానికి, ఇళ్ళు లేకపోవడానికి, సామాజిక-ఆర్థిక అభద్రతకు, క్లుప్తంగా మనకున్న సకల కష్టాలకి మనమే బాధ్యులమని మన దేశ పాలకులు మనల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. దోపిడీ పాలకులందరూ చేసేది ఇదే! ఈరోజు వాళ్ళు మనకి చెప్తున్నది ఏంటి? రోజుకి 18 గంటలు పనిచేయడానికి సిద్ధంగా లేము కాబట్టి మనం పనికిరాని వాళ్ళం! ఎక్కువ మంది పిల్లల్ని కంటున్నాం కాబట్టే మనకి ఇన్ని కష్టాలు! అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో కొనసాగుతున్న మాంద్యం కారణంగా భారతదేశంలో ధరలు, నిరుద్యోగం పెరుగుతున్నాయని మన పాలకులు చెబుతున్నారు. నిరుద్యోగం, ధరలు పెరగడంలో అసలు ప్రభుత్వం తప్పు ఏమీ లేదని, భూకంపాలు, సునామీలలాగానే వీటిపై కూడా ఎవరికీ ఎటువంటి నియంత్రణా ఉండదనీ, ఇవి కూడా ప్రకృతి వైపరీత్యాలలాంటివే అనీ మనల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే పాలకవర్గం మనకి బోధిస్తున్న ఈ విషయాలలో అసలు నిజం ఉందా? లేశమాత్రమైనా లేదు! **పెరుగుతున్న నిరుద్యోగం, ధరలు, సామాజిక-ఆర్థిక అభద్రత అన్నీ విధి ఆడుతున్న వింత నాటకం అని మనల్ని నమ్మించడానికే ఈ ప్రయత్నాలన్నీ**. మనం అలా నమ్మడమే ఈ దొంగ పాలకులకి కావాల్సింది.

ప్రత్యేకంగా గత 10 సంవత్సరాలలో భారతదేశంలోని శ్రామిక ప్రజల జీవన ప్రమాణాలు, పని పరిస్థితులు అనూహ్యంగా పతనమవుతూ వచ్చాయి. దీనికి కారణం, ప్రస్తుత ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే. ఇంతకుముందు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కూడా దేశంలోని ఫ్యాక్టరీ ఓనర్లు, కాంట్రాక్టర్లు, భూ యజమానులు, దళారీలు, మధ్యవర్తుల ప్రయోజనాల కోసమే పనిచేసేవి. అయితే **2014 నుండి అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం మాత్రం, డబ్బులున్న వారికి బహిరంగంగా సేవ చేస్తూ, సామాన్య ప్రజలను దోచుకోవడంలో ఉన్న రికార్డులు అన్నిటినీ బద్దలు కొట్టేసింది. ఈరోజు మనం ఈ సత్యాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.**

## ధరలు ఎందుకు ఆకాశాన్నంటుతున్నాయి?

ద్రవ్యోల్బణం ఎందుకు పెరుగుతోంది? వివిధ సరుకులు, సేవల ధరలు ఎప్పటికప్పుడు పెరుగుతూ ఉండడం వెనక ఒక వ్యవస్థాగత కారణం ఉంది: **ఈరోజు మన వ్యవస్థలో జరిగే మొత్తం ఉత్పత్తి, వినియోగం, పంపిణీలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఒక ప్రణాళిక ప్రకారం జరగవు. మనం ఉన్న వ్యవస్థలో ఇవన్నీ ఎంతో అస్తవ్యస్తంగా కేవలం కొద్దిమంది ధనవంతుల జేబులు నింపడానికి మాత్రమే జరుగుతాయి**. ఇటువంటి అస్తవ్యస్త వ్యవస్థలో, వివిధ వస్తువుల ధరలు వివిధ సమయాల్లో పెరుగుతూ, తగ్గుతూ ఉంటాయి. కానీ ఈరోజు మన దేశంలో ధరలు రికార్డులు అన్నిటినీ బద్దలుగొట్టడం వెనక ఒక తక్షణ కారణం కూడా ఉంది: **మోడీ ప్రభుత్వం ఒకవైపు జేబులు నిండిన ధనికుల ప్రయోజనాలను కాపాడడం కోసం వారికి అనేక రాయితీలు, పన్ను మినహాయింపులు ఇస్తూ, మరోవైపు సామాన్యులపై పన్నుల భారం వేస్తోంది**. గత పదేళ్లలో మోడీ ప్రభుత్వం పెద్ద పెద్ద ఫ్యాక్టరీల యజమానులు, కంపెనీలపై పన్నులు తగ్గించింది. వారికి చాలా చవకగా భూమి, విద్యుత్, నీరు, రుణాలు కూడా అందించింది. అయితే ఇదే సమయంలో సామాన్య ప్రజలపై పరోక్ష పన్నుల భారాన్ని విపరీతంగా మోపింది.

2017కి ముందు, పన్ను రూపంలో **ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో 32%** సంపన్నుల నుంచి వసూలు చేసే **కార్పొరేట్ ట్యాక్స్** ద్వారా వచ్చేది. 2023కి ఇది **24% కంటే తక్కువకి పడిపోయింది**. అయితే వీరి లాభాలు ఈ మధ్యకాలంలో విపరీతంగా పెరిగాయి. మరోవైపు **జీఎస్టీ**, ఇతర చార్జీల ద్వారా సామాన్య ప్రజలపై పన్ను భారం విపరీతంగా పెరిగింది. ఇది మొత్తం పన్ను ఆదాయంలో సగం కంటే ఎక్కువ! **పెట్రోలియం ఉత్పత్తుల**

ధరల్లో **60% పన్నులే. 2021-22లో పెట్రోల్, డీజిల్‌పై పన్నుల రూపంలో కేంద్ర ప్రభుత్వం రూ. 3.73 లక్షల కోట్లు వసూలు చేయగా, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ. 2.02 లక్షల కోట్లు వసూలు చేశాయి. పెట్రోలు, డీజిల్ ధరలు ఇంత భారీగా పెరిగినప్పుడు అది ప్రతి వస్తువు ధరపై ప్రభావం చూపుతుంది. అదేవిధంగా, కేంద్ర ప్రభుత్వం గత 10 ఏళ్లలో గ్యాస్ ధరలనూ రెండు రెట్లకి పైన పెంచింది.** ఇది సామాన్యుల ఆర్థిక పరిస్థితిపై ప్రత్యక్షంగా దారుణమైన ప్రభావం చూపింది.

బడా వ్యాపారులకు ఇచ్చిన భారీ పన్ను మినహాయింపులను భర్తీ చేయడానికే మోడీ ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం పెంచుతోంది. పెట్టుబడిదారులకు ఇస్తున్న రాయితీల వల్ల ప్రభుత్వ ఆదాయం తగ్గిపోతున్న క్రమంలో, రాజకీయ నాయకులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పెద్ద బ్యూరోక్రాట్లకు కల్పించే సౌకర్యాలు తగ్గకుండా చూసేందుకు సామాన్య ప్రజలపై పన్నుల భారాన్ని నిరంతరం పెంచుతూనే ఉన్నారు. **గత పదేళ్లలో మన దేశంలో ధరలు ఇంతకుముందెన్నడూ లేని రీతిలో పెరగడానికి ఇదే నిజమైన కారణం. ఇదేదో ప్రకృతి వైపరీత్యం కాదు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలే దీనికి కారణం. పెట్టుబడిదారులకు సేవ చేయడం, వారిని పెంచి పోషించడం, ప్రజలను దోచుకుని సర్వనాశనం చేయడమే ఈ విధానాల లక్ష్యం.**

**పెట్రోలియం ఉత్పత్తులపై పన్ను**

**60%**

## నిరుద్యోగం ఇంతలా ఎందుకు పెరుగుతోంది?

నిరుద్యోగానికి కారణం పెరుగుతున్న జనాభానే అని మనకి ఎప్పుడూ చెబుతూ ఉంటారు. ఇది ఒక చెత్త వాదన. ఒక మనిషి కేవలం ఆకలిగా ఉన్న పొట్టతో మాత్రమే పుట్టడు కదా! అతనికి పనిచేసేందుకు ఉపయోగపడే చేతులు, కాళ్ళు కూడా ఉంటాయి. అతని శ్రమ ప్రకృతితో కలిసి గొప్ప సంపదను సృష్టించగలదు. ఈ చిన్న విషయాన్ని అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు: **జనాభా ఎక్కువ ఉంటే, వారి అవసరాలు ఎక్కువ ఉంటాయి. ఆ అవసరాలను తీర్చడానికి ఎక్కువ ఉత్పత్తి జరగాలి. ఎక్కువ ఉత్పత్తి జరగాలంటే ఎక్కువ మంది పని చేయాలి, ఉద్యోగం చేయాలి. గత పదేళ్లలో మన దేశంలో ఆహారోత్పత్తి 18.30% పెరిగింది. అదే సమయంలో జనాభా 10.7% మాత్రమే పెరిగింది.** అలాంటప్పుడు దేశంలో ఆకలి, పోషకాహార లోపం లాంటి సమస్యలు తగ్గాలి కదా! ఎందుకు పెరిగాయి? అంటే అసలు విషయం స్పష్టం: అధిక జనాభా అనేది సాధారణ ప్రజలకు చెప్పే ఒక సాకు మాత్రమే. ఇంకొంచం లోతుగా పరిశీలిస్తే, విద్యావంతులు ఎక్కువగా ఉన్న సమాజాలలో ప్రజలు ఎక్కువ మంది పిల్లలను కనరు. సంతానం విషయంలో నిర్ణయం తీసుకోవడం మహిళలకున్న ప్రజాస్వామిక హక్కు కూడా. అయితే మన సమాజం నేడు అందుకు భిన్నంగా ఉండడానికి, నిరక్షరాస్యత, సాంస్కృతిక వెనుకబాటుతనం ప్రబలంగా ఉండడానికి కూడా ప్రస్తుత వ్యవస్థే కారణం. అంతేతప్ప **ఆకలి, నిరుద్యోగం, పేదరికాలకి అధిక జనాభా కారణం కాదు**. వాస్తవాలు, గణాంకాలు చూస్తే మనకి ఈ విషయం అర్థం అయిపోతుంది.

**నిరుద్యోగం పెరగడానికి అతిముఖ్యమైన వ్యవస్థాగత కారణం, లాభమే పరమావధిగా నడిచే వ్యవస్థ**. ఈ వ్యవస్థలో ఉత్పత్తి యొక్క ఉద్దేశ్యం యజమానుల లాభాలే తప్ప సామాన్య ప్రజల స్థితిగతులను మెరుగుపరచడం, వారి అవసరాలను తీర్చడం, మానవీయ పని పరిస్థితులను సృష్టించడం కాదు. అటువంటప్పుడు సహజంగానే ఇక్కడ నిరుద్యోగం పెరుగుతుంది!

అంబానీ, అదానీ వంటి వ్యక్తుల లాభదాయకత తగ్గకుండా ఉండటానికి మోడీ ప్రభుత్వం గత 10 సంవత్సరాలలో ఆర్థిక వ్యవస్థను నిర్వహించిన తీరే ఈరోజు నిరుద్యోగం అన్ని రికార్డులను బద్దలు కొట్టడానికి కారణం. ఈ 10 సంవత్సరాలలో ప్రైవేటీకరణ తుఫాను వల్ల ఉద్యోగాల కోతలు భారీగా జరిగాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే **2016లో 41.2 కోట్లుగా ఉన్న ఉద్యోగాలు 2021 నాటికి 40.4 కోట్లకి తగ్గిపోయాయి**. ఇక్కడ అధికారిక నిర్వచనం ప్రకారం మీరు గత వారం రోజులలో ఒక్క రోజు పనిచేసినా, మీకు పని ఉన్నట్టే. అంటే ఉద్యోగిగానే పరిగణించబడతారు! ప్రజలకు ఈ విషయాలేవీ తెలియకుండా ఉండేందుకు మోడీ సర్కార్ ఉద్యోగాల గణాంకాల సేకరణను కూడా నిలిపివేసింది. వాస్తవం ఏమిటంటే, **అక్టోబర్ 2023లో నిరుద్యోగ రేటు 10.1 శాతాన్ని మించిపోయి ఒక కొత్త రికార్డును కూడా నెలకొల్పింది** (మూలం: సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ). **2021 నాటికి, యువతలో ఉపాధి రేటు 10.4% ఉంది. అంటే 100కి 90 మంది యువకులు నిరుద్యోగులే. గత పదేళ్ళ మోడీ ప్రభుత్వ పాలనలో నిమిషానికి 3, గంటకు 182, రోజుకు 4400 చొప్పున ఉద్యోగాలు పోయాయి**. ముఖ్యంగా నోట్ల రద్దు, కోవిడ్ సమయంలో అనుసరించిన తప్పుడు విధానాలు, ప్రణాళిక లేకుండా విధించిన లాక్‌డౌన్‌లు ప్రజల జీవనోపాధిని నాశనం చేశాయి. నిరుద్యోగాన్ని పరిష్కరించేందుకు మోడీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోగా రైల్వేలు, విమానాశ్రయాలు, బ్యాంకులు, బీమా సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను యధేచ్ఛగా కొనసాగించింది. కార్మిక చట్టాలు అమలు జరిగేలా చూసే కార్మిక శాఖ యంత్రాంగాన్ని స్తంభింపజేసింది. ఈరోజు అసలు ఆ కార్మిక చట్టాలే లేకుండా చేసేందుకు సిద్ధమవుతోంది.

**నిరుద్యోగం రేటులో కొత్త రికార్డు**

**10.1%**

**(సీఎంఐఈ, అక్టోబర్ 2023)**

మన దేశంలో చాలా కాలంగా ప్రబలంగా ఉండి, మోడీ ప్రభుత్వ హయాంలో విస్తృతమైన **కాంట్రాక్టు వ్యవస్థ** కూడా నిరుద్యోగానికి కారణం. రోజువారీ వేతనం తీసుకుని పని చేసే కాంట్రాక్ట్ కార్మికులు సాధారణంగా 10-12 గంటలు, కొన్నిసార్లయితే 14-16 గంటలు కూడా పనిచేస్తారు. **భారతదేశంలోని కార్మికులలో 94% మంది అసంఘటిత రంగంలో, తాత్కాలిక కాంట్రాక్ట్ లేదా క్యాజువల్ కార్మికులుగా పనిచేస్తున్నారు. 60 కోట్ల శ్రామిక జనాభాలో 94% మంది 12 నుండి 14 గంటలు పనిచేస్తున్నారు. అంటే కార్మిక చట్టాలను వారి వరకు అమలు చేసినా 20-25 కోట్ల కొత్త ఉద్యోగాలు వస్తాయి**. కానీ అటు మోడీ ప్రభుత్వం, ఇటు దాని మిత్రులయిన నారాయణమూర్తి వంటి పెట్టుబడిదారులు తాము పన్నెండు గంటలు పని చేస్తున్నామని, ప్రజలు కూడా రోజుకు 12 గంటలు పనిచేయాలని చెబుతున్నారు. దానికి మన సమాధానం - "ఫ్యాక్టరీలు మీవి కాబట్టి

**2013-22 వరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలు కేవలం**

**7,22,311**

మీరు రోజుకు 12 గంటలు పని చేస్తున్నారు. చేయండి! ఫ్యాక్టరీలు, పొలాలు, గనులు మావి అయినప్పుడు, అవసరమైతే మా ఇష్టప్రకారం మేము కూడా 12 గంటలు పని చేస్తాం! ఇప్పుడు మాకు కార్మికులుగా మా హక్కు అయిన 8 గంటల పని దినం ఇవ్వండి."

**మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, సరళీకరణ, కాంట్రాక్టీకరణ, క్యాజువలైజేషన్, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఆర్థిక వ్యవస్థను నిర్వహిస్తున్న తీరే నిరుద్యోగానికి కూడా కారణం తప్ప నిరుద్యోగం ఏమీ భూకంపం, వరదలు లేదా సునామీ లాంటి ప్రకృతి వైపరీత్యం కాదు.**

## అవినీతి ఎందుకు అన్ని హద్దులు దాటుతోంది?

ప్రజలను దోచుకోడానికి పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాల నుండి అనుమతి లభిస్తున్నప్పుడు ఆ పనిలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వాలలోని మంత్రులు ఎందుకు వెనుకబడి ఉండాలి? వేరే సందర్భంలో శ్రీశ్రీ 'నేను సైతం' అన్నట్టు, వీరు కూడా తాము సైతం దొరికినంత దోచుకుంటున్నారు. చూడబోతే మోడీ ప్రభుత్వం రాముడి పేరు మీద '**దొరికినంత దోచుకో! అందినంత లాక్కో!**' అనే నినాదంతోనే పని చేస్తున్నట్టు ఉంది. 'నైతికత, సంస్కారం, చరిత్ర' అని సుద్దులు చెప్పే బీజేపీ ప్రభుత్వం చేసిన అవినీతిని చూసి ఇన్నాళ్ళూ అవినీతిపరులని ముద్ర వేసుకున్న వారంతా సిగ్గుతో తలదించుకుంటున్నారు. **10,000 కోట్ల వ్యాపమ్ స్కామ్, వేలకోట్ల రాఫెల్ కుంభకోణం, అదానీ స్కామ్, నోట్ల రద్దు స్కామ్, డీమ్యాట్ స్కామ్, డీడీసీఏ స్కామ్, ఎన్‌పీఏ స్కామ్**... ఇలా వారి కుంభకోణాల జాబితా రాస్తే ఒక పుస్తకమే నిండిపోతుంది. వీటిల్లో పోయిన వేలకోట్ల రూపాయల సొమ్ము ఎవరిది? ప్రజలదే! ఒకవైపు ధనవంతులు, పెట్టుబడిదారులు అందరూ తమ ఖజానాలు నింపుకుంటుంటే, మరోవైపు మంత్రులు, నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారులు, మధ్యవర్తులు, దళారులు కమీషన్‌తో జేబులు నింపుకున్నారు. మరోవైపు ఈ కుంభకోణాల గురించి మాట్లాడుతున్న గొంతులన్నిటినీ మోడీ ప్రభుత్వం అణిచివేస్తోంది. ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మల్లా ఉన్న న్యాయవ్యవస్థ, మీడియా, బ్యూరోక్రసీ ఇందుకు తమ శక్తిమేర కృషి చేస్తున్నాయి. మరీ ముఖ్యంగా గోదీ మీడియా ఇందులో ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. ఈరోజు గోదీ మీడియా ఏది నిజమని చెబితే అది అబద్ధమని, ఏది అబద్ధమని చెబితే అది నిజమనీ మనం ఒక రూలు పెట్టుకోవచ్చు. కేవలం నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) కుంభకోణం వల్లనే ప్రజల కష్టార్జితమైన రూ.2.67 లక్షల కోట్లతో ప్రభుత్వానికి మిత్రులయిన మోసగాళ్ళు విదేశాలకు పరారయ్యారు. ప్రభుత్వ సహకారం లేకుండా ఇది సాధ్యమా? అసాధ్యం!

**2014 నుంచి పెట్టుబడిదారులకు మాఫీ చేసిన అప్పులు**
**14.56**
**లక్షల కోట్లు**

## మతతత్వం, కులతత్వం, జాతీయోన్మాదం నల్లమందు ఎందుకు వెదజల్లుతున్నారు?

ఇంతవరకూ చర్చించిన అసలు సమస్యల గురించి ఆలోచించకుండా మనల్ని నిరోధించడానికి సంఘ్ పరివార్, బిజెపి, వారి ఒళ్ళో కూర్చున్న **గోదీ మీడియా మనకి మతోన్మాదం, కులతత్వం, జాతీయోన్మాదం వంటి నకిలీ సమస్యల వల పన్నుతున్నాయి**. ఒకసారి గుడి పేరుతో, ఇంకోసారి మసీదు పేరుతో, ఒకసారి లవ్ జిహాద్ అని, ఇంకోసారి ల్యాండ్ జిహాద్ అని, గోసంరక్షణ అని మోసపూరిత నాటకాలు వేస్తూ ప్రజల మత విశ్వాసాలను ఉపయోగించుకుని తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాయి. అప్పుడప్పుడు రిజర్వేషన్ రాజకీయాలను ఎగదోసి మనల్ని మోసం చేస్తున్నారు. చైనా అని పాకిస్తాన్ అని బూచిని చూపుతూ జాతీయోన్మాదాన్ని వ్యాపింపజేసే ప్రయత్నం చేస్తున్నారు. మతోన్మాదం, కులతత్వం, జాతీయోన్మాదాలతో ప్రజలను మోసం చేస్తున్నారు. **చైనా నుండి భారతదేశానికి ప్రమాదం ఉంటే, గత 5 సంవత్సరాల మోడీ పాలనలో చైనా నుండి భారతదేశానికి దిగుమతులు 30 శాతం ఎందుకు పెరిగాయి? చైనాతో భారతదేశ వాణిజ్య లోటు 1 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువకు ఎలా ఎగబాకింది? అలాగే, గోరక్షణ గురించి బీజేపీకి అంత ఆరాటం ఉంటే కేరళ, గోవా, ఈశాన్య రాష్ట్రాలలో బీఫ్ సరఫరాను పెంచుతామని బీజేపీ నేతలు ఎందుకు వాగ్దానం చేస్తున్నారు? గొడ్డు మాంసం ఎగుమతి చేసే కంపెనీ డైరెక్టర్ల బోర్డులో బీజేపీ నేత సంగీత్ సోమ్ ఎందుకు ఉన్నారు? మోడీ ప్రభుత్వ హయాంలో భారతదేశం ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద గొడ్డు మాంసం ఎగుమతిదారుగా ఎలా అవతరించింది? లవ్ జిహాద్‌పై బీజేపీ సీరియస్‌గా ఉంటే హిందూ మహిళలను పెళ్లి చేసుకున్న బీజేపీ నేతలు సికందర్ బఖ్త్, షానవాజ్ హుస్సేన్, ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీల ఇళ్ళపై సంఘీ గూండాలు ఎందుకు దాడి చేయలేదు? ముస్లిమ్ వ్యక్తిని పెళ్లాడిన బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి కూతురు ఇంటిపైకి ఎందుకు పోలేదు? ఈ ప్రశ్నల గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా?**

## మనం అర్థం చేసుకోవలసిన విషయం...

**దీన్ని బట్టి ఒక విషయం చాలా స్పష్టంగా అర్థమవుతుంది: ప్రస్తుత ప్రభుత్వం, సంఘ్ పరివార్ కలిసి మనలో అహేతుకమైన మత ఉద్రేకాలు, భయాలను సృష్టించి, వాటిని తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నాయి.** పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, పేదరికం, నిరక్షరాస్యత, ఆకలి వంటి సమస్యల నుండి మన దృష్టిని మరల్చడానికి మాత్రమే ఈ సమస్యలను లేవనెత్తుతున్నాయి. మనలో చాలా మంది అమాయకులు వారి కుట్రలో చిక్కుకుంటున్నారు. కానీ భవిష్యత్తులో ఎవరైనా మీవద్ద ఇలాంటి అబద్ధపు సమస్యలను ప్రస్తావిస్తే, వారికి ఇవ్వాల్సిన మర్యాద ఇచ్చి, ఇంటి బయటకి తోలండి. మనకు మంచి భవిష్యత్తు కావాలంటే జీవితంలోని వాస్తవ సమస్యల గురించి మాత్రమే మాట్లాడతామని నిర్ణయించుకోవాలి. మన ఉపాధి, విద్య, వైద్యం, ఇళ్ళు, సరుకుల ధరలు, అవినీతి నుండి విముక్తి, మతతత్వం, కులతత్వం నుండి స్వేచ్ఛ వంటి అసలైన సమస్యల గురించి మాత్రమే మాట్లాడాలని నిర్ణయించుకోవాలి. ఈ సమస్యలన్నింటిపై సామాన్య శ్రామిక ప్రజలమైన మనం మన స్వంత మిలిటెంట్ ఉద్యమాలను ప్రారంభించాలనే సంకల్పం తీసుకోవాలి. ఈ క్రమంలో మన ప్రధాన డిమాండ్లివీ:

## మన ప్రధాన డిమాండ్లు:

- విద్య-ఉద్యోగాలు-వైద్యం-ఇళ్ళు ప్రాథమిక హక్కులుగా ప్రకటించాలి. ప్రైవేటీకరణ నిషేధించాలి. **భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం** రూపొందించి, అమలు చేయాలి. ఉపాధి కల్పించలేని పక్షంలో నెలకు కనీసం రూ. 10,000 నిరుద్యోగ భృతి చెల్లించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలలోని ఖాళీలన్నింటినీ వెంటనే భర్తీ చేయాలి. 'అగ్నివీర్' స్కీమును వెంటనే ఉపసంహరించుకుని, పర్మనెంట్ రిక్రూట్‌మెంట్ విధానాన్ని పునఃప్రారంభించాలి.
- కార్మిక చట్టాలన్నింటినీ ఖచ్చితంగా అమలు చేయాలి. ఇటీవల ప్రతిపాదించిన నాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలి. **కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి, రెగ్యులర్ స్వభావం ఉన్న ఉద్యోగాలన్నింటినీ పర్మనెంటు చేయాలి.**
- ధరల పెరుగుదలని అడ్డుకునేందుకు **పరోక్ష పన్నులన్నింటినీ రద్దు చేయాలి**, ఆదాయంతో పాటు పెరిగే **ప్రత్యక్ష పన్ను వ్యవస్థని** ఖచ్చితంగా అమలు చేయాలి.
- **జాతీయ ఉపాధి హామీ పథకాన్ని** సరిగ్గా అమలు చేయాలి. ఏడాది పొడవునా పని కల్పించే ఏర్పాట్లు చేయాలి, ఆ పని చేసినందుకు గాను కనీస వేతనాలు ఇవ్వాలి.
- **పేద, మధ్య తరగతి రైతులకు** విత్తనాలు, ఎరువులు, కరెంటు వంటి సదుపాయాలు కల్పించాలి. అందుకు అవసరమయ్యే డబ్బును ధనిక వర్గంపై **ప్రత్యేక పన్నుల** రూపంలో వసూలు చేయాలి. ఈ రైతులకు **నీటి పారుదల వసతులు, బ్యాంకులలో రుణాలు** వచ్చే ఏర్పాట్లను ప్రభుత్వమే చేయాలి.
- 'సర్వ ధర్మ సమభావం' అనే నకిలీ లౌకికవాదం బదులు ప్రభుత్వ నిర్వహణలో మతంతో సంబంధం లేని **అసలైన లౌకిక రాజ్యంగా** భారత్‌ని మార్చే చట్టం తీసుకురావాలి. మతం, మత విశ్వాసాలను గురించి రాజకీయ నాయకులు కానీ, పార్టీలు కానీ మాట్లాడడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించాలి.
- అంటరానితనంతో పాటు కులవివక్షను, అది **ఏ రూపంలో ఉన్నా, శిక్షార్హమైన నేరంగా పరిగణించే విధంగా రాజ్యాంగాన్ని సవరించాలి.**
- ప్రభుత్వాలు, ఎన్నికల్లో పాల్గొనే పార్టీల **అవినీతిని గురించి విచారించేందుకు** ప్రజా ఆడిట్లు నిర్వహించాలి.
- **మహిళలు ఎదుర్కొనే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వివక్షలన్నింటినీ అంతం చేసే విధంగా కఠినమైన చట్టాలు తేవాలి.**
- **సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతూ, గుంపులుగా చట్టాన్ని చేతిలోకి తీసుకుంటూ, మతపరమైన హింసలో పాల్గొంటున్న సంస్థలని, పార్టీలని తీవ్రవాద సంస్థలుగా గుర్తించాలి.** ఆయా సంస్థల నాయకులు, కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

మిత్రులారా! పైన **పేర్కొన్న డిమాండ్లన్నీ మన జీవితానికి సంబంధించిన ప్రాథమిక డిమాండ్లు. ఇవి ఆచరణసాధ్యమైన డిమాండ్లు. నెరవేర్చగలిగిన డిమాండ్లు.** ప్రపంచంలోని కొన్ని దేశాలలో ప్రజలు శక్తివంచన లేకుండా పోరాడి ఈ హక్కులను సాధించుకున్నారు కూడా. సమాజంలో ఒక విప్లవాత్మక మార్పు కోసం జరిగే సుదీర్ఘ పోరాటంలో ఇది ప్రారంభ దశ. ఈ డిమాండ్ల గురించి ఎన్నికల కోసమే నడిచే పార్టీ ఏదీ పోరాటం చేయదు. కారణం కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్, తెలుగు దేశం, బీఆర్ఎస్, ఆప్, ఎస్పీ, బీఎస్పీ, శివసేన, ఎన్సీపీ, ఆర్జేడీ, జేడీయూ, జేడీ(ఎస్), సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, అకాలీ దళ్ వంటి అన్ని ఎన్నికల పార్టీలు డబ్బున్న ఫ్యాక్టరీ యాజమానుల దగ్గర వసూలు చేసిన చందాల సాయంతోనే నడుస్తున్నాయి. డబ్బులు ఇచ్చినవారి ప్రయోజనాలకు ఉపయోగపడే పాలసీలను వివిధ మార్గాల్లో రూపొందిస్తారు. నియంతృత్వ ధోరణితో, సిగ్గుమాలిన రీతిలో మనపై ప్రజావ్యతిరేక విధానాలను ప్రయోగించి, మతం పేరుతో మనలో మనం కొట్టుకునేలా చేసే ఫాసిస్టు బిజెపి దేశ పాలకులకు మరింత అవసరం.

అందుకే, ఈ రోజు, దేశంలోని శ్రామిక ప్రజలు ఈ డిమాండ్లపై తమ స్వంత సమరశీల ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించి, ప్రస్తుత ప్రజావ్యతిరేక ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి. 2024లో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తమ డిమాండ్లను విస్మరించకుండా ఈ మిలిటెంట్ ఉద్యమం కొనసాగేలా జాగ్రత్త పడాలి. ప్రజల ప్రాథమిక హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలను తీసిపారేయడం ప్రజల హక్కే కాదు, బాధ్యత కూడా అన్న షహీద్-ఎ-ఆజమ్ భగత్ సింగ్ మాటలను **మనం ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాలి. షహీద్-ఎ-ఆజమ్ ఇచ్చిన ఈ సందేశాన్ని అందుకుని, దాని అమలు దిశగా ప్రయాణం మొదలుపెట్టడానికి సమయం ఆసన్నమైంది. రండి... మా ప్రచారంలో, మేము ప్రారంభించిన ఈ ఉద్యమంలో చేరండి, ఒక గొప్ప భవిష్యత్తు కోసం జరిగే పోరాటంలో భాగస్వాములవ్వండి!**

- **నవజవాన్ భారత్ సభ**
- **దిశ విద్యార్థి సంఘం**
- **రివల్యూషనరీ వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా**
- **బిగుల్ మజ్దూర్ దస్తా**

BHAGAT SINGH JAN ADHIKAR YATRA
BSJAY

ఢిల్లీ: 9289498250, 9693469694; ఉత్తర్‌ప్రదేశ్: 8858288593, 9891951393; హర్యానా: 8685030984; మహారాష్ట్ర: 7798364729, 9619039793; బీహార్: 8860792320; ఉత్తరాఖండ్: 9971158783; పంజాబ్: 9888080820; ఆంధ్రప్రదేశ్: 7995828171, 8500208259; తెలంగాణ: 9971196111; చండీగఢ్: 8196803093

@bsjayatra 9582712837